క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్కే బక్రీద్ శుభాకాంక్షలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని ముస్లింలకు శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి బుధవారం బక్రీద్ శుభాకాంక్షలను తెలియజేశారు. త్యాగానికి చిహ్నమైన బక్రీద్ పండుగను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

తాడికొండ: తాడికొండ నియోజకవర్గ ముస్లింలకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త కత్తెర సురేష్ కుమార్ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగనిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని, ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా రాగ ద్వేషాలకు అతీతంగా ముస్లింలందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఈ పండుగ వేళ అందరికీ అల్లా ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

108 వాహనంలో ప్రసవం



ఫిరంగిపురం: పురిటి నొప్పులు వచ్చిన గర్భిణిని 108 వాహనంలో గుంటూరు జీజీహెచ్‌కు తరలిస్తున్న క్రమంలో నొప్పులు ఎక్కువవడంతో వాహనంలో సిబ్బంది సుఖ ప్రసవం చేసిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం ప్రకారం అల్లంవారిపాలెం గ్రామానికి చెందిన పి.శ్రీలక్ష్మి గర్భిణికి తెల్లవారుజామున 1: 38 గంటల ప్రాంతంలో నొప్పులు రావడంతో గుంటూరు జీజీహెచ్‌కు కాన్పుకోసం తీసుకువెళ్లేందుకు 108వాహనానికి ఫోన్ చేశారు. దీంతో వాహన సిబ్బంది, శ్రీలక్ష్మి, మరో మహిళతో వైద్యశాలకు తీసుకు వెళుతుండగా అమీనాబాద్ మల్కాచెరువు ప్రాంతం వద్ద పురిటి నొప్పులు ఎక్కువవడంతో 108 వాహన సిబ్బంది (ఎన్‌ఎంసీ) సాగర్‌బాబు, పైలెట్ కుమార్‌లు గర్భిణికి సుఖ ప్రసవం చేశారు. అనంతరం వారిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు.

రేపటి మహాధర్నాను విజయవంతం చేయండి

తాడేపల్లిరూరల్: రైతాంగ సమస్యలపై విజయవాడలోని అలంకార్ సెంటర్ ధర్నాచౌక్‌లో రేపు నిర్వహించనున్న మహాధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నా శివశంకరరావు పిలుపునిచ్చారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో జూన్ 30న నిర్వహించే మహాధర్నాపై విస్తృత ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ 2022 నవంబర్, డిసెంబర్ నెలల్లో కురిసిన వర్షాల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయారని, పంట నష్టపోయిన రైతులందరికీ పంటల బీమా ఇన్‌పుట్ సబ్సిడీలను అందజేయాలని, అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. తాడేపల్లి యూవన్ జోన్ తొలగింపులో సీఎల్‌యూ చార్జీలను ఎత్తివేయాలని కోరుతున్నామన్నారు. రైతాంగ సమస్యలపై జరుగుతున్న ఈ మహాధర్నాలో రైతులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. నాయకులు డి.వెంకటరెడ్డి, పి.కృష్ణ, బి.శామ్సన్, బి.గోపాలరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవితకు విద్యాకానుక దోహదం

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలోని మండలపరిషత్ ఆది ఆంధ్రప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల భవితకు జగనన్న విద్యాకానుక ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ ఉడుముల అనూష మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల కోసం అమ్మఒడి, జగనన్న గోరుముద్ద, విద్యాకానుక వంటి పథకాలు ప్రవేశపెట్టి వారి ఉన్నతికి ఎంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని కాజ గ్రామంలో తాళాలు వేసిన ఇంట్లో చోరీ జరిగిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం మంచిరాజు రాధాకృష్ణమూర్తి పౌరహిత్యం చేస్తూ కాజలో నివాసముంటున్నాడు. ఈ నెల 22వ తేదీ వల్లభాపురంలోని నివాసముంటున్న తన కుమార్తె ఇంటికి వెళ్లి తిరిగి 27వ తేదీ సాయంత్రం ఇంటికి రాగా తాళాలు పగలకొట్టి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టి ఉంది. బీరువాలో సుమా రు 40 గ్రాముల బంగారు, వెండి వస్తువులు, రూ.4లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జరిగిన ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అభివృద్ధి డొంక కదిలింది

బీటీ రోడ్లుగా మారనున్న డొంకరోడ్లు

- 23,890 మీటర్ల పొడవున, 73 మీటర్ల వెడల్పున నిర్మాణాలు
- సుమారు రూ.22.68 కోట్ల నిధులు కేటాయింపు
- తాడేపల్లి రూరల్‌లో 18 డొంకరోడ్లు బీటీ రోడ్లగా నిర్మాణం
- ఇప్పటికే నాలుగు రోడ్ల నిర్మాణం పూర్తి
- మరో తొమ్మిది రోడ్లు నిర్మాణ దశలో
- మరో ఐదు నిర్మాణానికి సిద్ధం

తాడేపల్లిరూరల్: నేను ఒక రైతు బిడ్డనే. రైతుల కష్టాలు నాకు తెలుసు. 40–50 సంవత్సరాలుగా డొంకరోడ్లు నిర్మాణం కాక రైతులు పడుతున్న కష్టాలు నేనూ చూశా. ఒక బస్తాను పొలం నుంచి ప్రధాన రహదారికి తీసుకురావాలంటే రైతు ఎంతో కష్టపడాలి, ఎన్నో వ్యయప్రయాలు పడాలి అని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి రైతులతో గతంలో అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డొంకరోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామని ఎమ్మెల్యే ఆర్కే హామీ ఇచ్చారు. అన్న మాట ప్రకారం రెండవసారి శాసనసభ్యులుగా గెలిచిన మొదటి సంవత్సరమే ఎంటీఎంసీ పరిధిలోని విలీన గ్రామాలతో పాటు దుగ్గిరాల మండలంలో రైతులు పంటపొలాలకు వెళ్లే డొంకరోడ్ల జంగిల్ క్లియరెన్స్ దగ్గర నుంచి విస్తరణ, గ్రావెల్ ఫిల్లింగ్ పనులు సుమారు 20 కోట్ల వ్యయంతో దాదాపుగా 150 కి.మీ. పొడవున నిర్మించారు. రెండు వర్షాకాలాల అనంతరం వాటిని బీటీ రోడ్లుగా మారుస్తానని హామీ ఇచ్చారు. దానిలో భాగంగా విలీన గ్రామాల్లో పలు మండలాలను, విలీన గ్రామాలను కలుపుతూ ఉన్న డొంకరోడ్లకు ప్రాధాన్యత కల్పిస్తూ దాదాపుగా 24 కి.మీ. దూరం, ప్రతిరోడ్డు 4 మీటర్ల వెడల్పుతో సుమారు రూ.22.68 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణాలను చేపట్టారు.

నిర్మాణమైన, నిర్మాణంలో ఉన్న రహదారుల వివరాలు..

ప్రాంతం	పొడవు (మీటర్లలో)	వెడల్పు (మీటర్లలో)	కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)
మెల్లెంపూడి–నూతక్కి	2700	4	2.30
మెల్లెంపూడి–రేవేంద్రపాడు కరకట్ట	850	4	0.90
చిర్రావూరు–నూతక్కి	550	4	0.60
రేవల్లె కరకట్ట–గుండిమెడ ఆర్‌అండ్‌బీ రోడ్డు	1500	4	1.30
నూతక్కి–పెరికలపూడి	2100	4	2
పెనుమాక వైఎస్సార్ విగ్రహం నుంచి కొండవీటివాగు బ్రిడ్జి	1400	5	1.20
యర్రబాలెం మామిడితోట నుంచి కృష్ణాయపాలెం రోడ్డు వరకు	1140	4	1.10
ఉండవల్లి కొండవీటి వాగు వద్ద నుంచి పెనుమాక రొయ్యల చెరువు వరకు	1050	4	1.10
గుంటూరు చానల్ హెడ్ స్లూయిస్ నుంచి బకింగ్‌హామ్ కెనాల్ ఎక్స్‌స్లూయిస్ వరకు	1500	4	1.50
ప్రాతూరు – రేవల్లె కరకట్ట దగ్గర నుంచి ఎస్సీ బరియల్ గ్రౌండ్ వరకు	1200	4	1
ప్రాతూరు – రేవల్లె కరకట్ట నుంచి హిందూ స్మశాన వాటిక వరకు	600	4	0.60
ఇప్పటం బకింగ్‌హామ్ కెనాల్ నుంచి గంగరాయ చెట్టు వరకు	1600	4	1
నూతక్కి డొంక	1400	4	1.59
నిడమర్రు–బేతపూడి డొంక	1400	4	1.30
టిడ్కో ఇళ్లు నుండి నిడమర్రు డొంక	1300	4	1.55
కుంచనపల్లి – గుండిమెడ డొంక	500	4	1.00
కుంచనపల్లి–కేఎల్‌యూ రోడ్, గుండిమెడ	1900	4	1.10
బేతపూడిడొంక– బరియల్ గ్రౌండ్	1200	4	1.54
మొత్తం	23890	73	22.68

చకచకా పనులు..

ఇప్పటికే ఎంటీఎంసీలో తాడేపల్లి రూరల్‌లో మెల్లెంపూడిలో చేపట్టిన బీటీ రోడ్ మరమ్మతులతో పాటు కొత్తరోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేశారు. తాడేపల్లి రూరల్ ఇప్పటం పెదవడ్లపూడి రోడ్ నుంచి వడ్డేశ్వరం బకింగ్‌హామ్ కెనాల్ కాలవ కట్ట మీదుగా పెదవడ్లపూడి వరకు డొంకరోడ్డు వరకు బీటీ రోడ్ నిర్మాణాన్ని పూర్తి చేశారు. అలాగే ఇప్పటం పెదవడ్లపూడి ప్రధాన రహదారి నుండి పెదవడ్లపూడి – ఇప్పటం పొలాలను కలుపుతూ గంగరాయ చెట్టు వరకు బీటీ రోడ్ నిర్మాణం పూర్తయ్యింది. ఇలానియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే నాలుగు బీటీ రోడ్లు నిర్మాణ పనులు ప్రారంభించగా, మరో 14 రోడ్లు నిర్మాణానికి ఎంటీఎంసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటి వరకు అధికారులు గ్రావెల్ రోడ్లుగా నిర్మించిన డొంకరోడ్లలో కొన్ని ఎమ్మెల్యే సొంత నిధులు కాగా, మరికొన్ని స్థానిక సంస్థల నిధులతో చేపట్టారు. ప్రస్తుతం బీటీ రోడ్ల నిర్మాణాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థకు కేటాయించిన ప్రత్యేక నిధుల నుంచి మంజూరు చేసినట్లు అధికారులు తెలియజేశారు.



పెనుమాక యర్రబాలెం రోడ్డు నుంచి కృష్ణాయపాలెం వరకు నిర్మాణంలో వున్న బీటీ రోడ్డు

కోనేరు అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్సీ



తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణంలో అతి పురాతనమైన పెదకోనేరు అడుగు భాగం ప్రజలకు చూపించడమే మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. బుధవారం పెదకోనేరులో జరుగుతున్న అభివృద్ధి పనులను వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెదకోనేరు ఇంత లోతుగా ఉంటుందని ఇప్పటివరకు మంగళగిరిలో ఉన్న ఇప్పటి తరానికి తెలియదని, ఎమ్మెల్యే ఆర్కే మన హిందూ సాంప్రదాయాలను ప్రజలకు చూపించాలనే ఉద్దేశ్యంతో ఓఎన్‌జీసీ వారు కూడా చేయలేని పూడికతీత పనులను పట్టువదలని విక్రమార్కుడిలా చేయిస్తున్నారని, అతి త్వరలో అడుగుభాగాన్ని సైతం ప్రజలకు చూపిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, డీఈ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సమస్యలు పరిష్కారం

పలుచోట్ల అవగాహనా సదస్సులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో బుధవారం జగనన్న సురక్షపై అవగాహన సదస్సులు నిర్వహించి ఇంటింటికి తిరిగి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంలో వివిధ శాఖల అధికారులతో కలసి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు వేదిక ఏర్పాటు చేస్తున్నారని, ఆ వేదికలో ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా ప్రణాళిక రూపొందించాలని, వార్డు వలంటీర్లతో పాటు సచివాలయ సిబ్బందితో కలసి ప్రతి ఇంటికి తిరిగి సమస్యలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. తాడేపల్లి పట్టణ సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఈదుల మూడి డేవిడ్ రాజు, గుంటూరు జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ వెంకటరామరెడ్డి, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి

ఇంటింటి ప్రచారం..

తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం సచివాలయంలో వార్డు కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు సంయుక్తంగా ఇంటింటికి తిరిగి జగనన్న సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంట్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని జగనన్న సురక్ష కార్యక్రమంలో పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలసాని అనీల్, బత్తుల దాసు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి తిరగాల్సిందే..

డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి

తాడేపల్లి పట్టణ పరిధిలోని మహానాడు, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో జగనన్న సురక్ష పథకంపై జరుగుతున్న విస్తృతస్థాయి ప్రచారంలో ఎంటీఎంసీ డిప్యూటి కమిషనర్ శివారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, కమిషనర్ శారదాదేవి సూచనల మేరకు జగనన్న సురక్ష పథకంపై 11 అంశాలపై విస్తృతప్రచారం నిర్వహిస్తున్నామని, ఎవరైనా అర్హులై ఉండి వారికి సంక్షేమ పథకాలు అందకపోయినా, రేషన్ కార్డులురాకపోయినా వారి పేర్లను నమోదు చేసుకుని వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేయించి జగనన్న సురక్ష ద్వారా పరిష్కరించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

మైనార్టీల అభివృద్ధికి సీఎం జగన్ కృషి ఎనలేనిది

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా

ఫిరంగిపురం: రాష్ట్రంలో ముస్లిం మైనార్టీ వర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి ఎనలేనిదని వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ హబీబుల్లా అన్నారు. మండలంలోని అమీనాబాద్ వేములూరిపాడు గ్రామాల్లోని నాలుగు మసీదుల్లోని (సర్) మతపెద్దలు, ఇమామ్‌లతో కలిసి (హర్ దిల్‌మే వైఎస్సార్ హమ్‌సబ్ జగన్‌కే సాత్) కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముస్లిం మైనార్టీలకు చేసిన అభివృద్ధి గురించి వివరించామన్నారు. ఇమామ్, మౌజన్‌లకు ప్రభుత్వం ప్రతినెలా గౌరవవేతనం ఇస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఇప్పటివరకు అందనివారు వివరాలు అందజేస్తే, వారికి గౌరవవేతనం లభించేలా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోని మసీదుల ప్రహరీల నిర్మాణాలకు, కొద్దిపాటి మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు మైనార్టీ వర్గాల అభివృద్ధికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ఇంటింటికి తిరిగి వివరించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమం ఆరు నెలలపాటు కొనసాగుతుందని చెప్పారు. అర్హులై ఉండి ఇప్పటి వరకు లబ్ధిపొందని మైనార్టీలు ఉంటే వారి సమస్యలు తెలియజేస్తే, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమం ద్వారా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని చెప్పారు. అనంతరం హర్‌దిల్ మే వైఎస్సార్.. హమ్‌సబ్ జగన్‌కే సాత్ కరపత్రాలను అందజేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ షేక్ జిలానీ, ఎంపీటీసీ సభ్యుడు గాందీబుడే, మండల కో–ఆప్షన్ సభ్యుడు సుబానీ, నూర్, బాబు, మాబుల్లా పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న సయ్యద్ హబీబుల్లా, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ షేక్ జిలానీ

దుగ్గిరాలలో అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే సొంత నిధులతో పెనుమూలిలో జరుగుతున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి పనులు



తుమ్మపూడిలో ఆర్‌సీఎం చర్చి వద్ద పూర్తి చేసిన సీసీ రోడ్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని జిల్లా మైనింగ్ శాఖ నుంచి సుమారు రూ.4 కోట్ల నిధులు విడుదల కావడంతో దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి, చినపాలెం గ్రామాల్లో బుధవారం రూ.27 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు ప్రారంభించారు. తుమ్మపూడి గ్రామంలో ఆర్‌సీఎం స్కూల్ వద్ద సుమారు రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్ నిర్మాణం పూర్తికాగా, రూ.17 లక్షల ఖర్చుతో చినపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి తెలిపారు. మైనింగ్ శాఖ నుంచి విడుదలైన రూ. 4 కోట్లతో 18 గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఎమ్మెల్యే సొంత నిధులతో....

మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామృష్ణారెడ్డి (ఆర్కే) సొంత నిధులతో పెనుమూలిలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చింతలపూడి శ్మశాన వాటిక, పలు చోట్ల గ్రావెల్ రోడ్ల నిర్మాణాలు, పెరుకలపూడి హెడ్ స్లూయిస్ మరమ్మత్తులు ఎమ్మెల్యే సొంత నిధులతో చేస్తున్నట్లు, వాటిని గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పర్యవేక్షణలో అభివృద్ధి పనులు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆర్కే సొంత నిధులు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టడంపై ఆ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు.

నగదు డ్రా చేసేటప్పుడు జాగ్రత్తలు అవసరం

మంగళగిరి పట్టణ సీఐ అంకమ్మరావు





పోలీసులు విడుదల చేసిన ఏటీఎంల వద్ద దొంగతనాలకు పాల్పడే వ్యక్తుల చిత్రాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలో ఏటీఎం సెంటర్లలో డబ్బులు డ్రా చేసే సమయంలో కొంతమంది పక్కవారి సహాయం అడుగుతున్నారని, అలాంటి వారిని మోసం చేసే వారు కొంతమంది ఏటీఎంల దగ్గర కాపలా కాస్తున్నారని వారి ఫొటోలను పట్టణ సీఐ అంకమ్మరావు బుధవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో పలు ఏటీఎంసెంటర్ల వద్ద ప్రజలను మోసం చేస్తూ దొంగలు తిరుగుతున్నారని, డబ్బులు డ్రా చేసి ఇస్తామని ఏటీఎం కార్డు తీసుకుని డబ్బులు డ్రా చేసిన అనంతరం వారి వద్ద వున్న వేరే కార్డు ఇచ్చి మోసం చేసి, మళ్లీ ఆ కార్డు ద్వారా డబ్బులు డ్రాచేసుకుంటున్నారని, అలాంటి ఇద్దరిని గుర్తించామని, వీరిని ఏటీఎంల వద్ద గుర్తిస్తే వెంటనే 8688831354, 8688831559 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కో–ఆపరేటివ్ సొసైటీ దుగ్గిరాల బ్రాంచ్‌లో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు దుగ్గిరాల వ్యవసాయ శాఖ అధికారి శిరీష బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నాలుగు రకాల వరి విత్తనాలు కిలో రూ.40 చొప్పున 25 కేజీల బ్యాగ్‌లు సొసైటీలో అందజేస్తున్నామన్నారు.

కేఎల్‌యూను సందర్శించిన జపాన్ ఐటీ కన్సల్టెన్సీ బృందం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీని జపాన్ ఐటీ కన్సల్టెన్సీ హెచ్‌ఆర్ బృందం బుధవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఉద్యోగాల కల్పన డీన్ డాక్టర్ ఎస్.బి.వి. ప్రసాద్ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం పూర్తిచేసుకున్న విద్యార్థులకు జపాన్ ఐటీ కంపెలలో ఉద్యోగాలను కల్పించడానికి జపాన్‌కు చెందిన జీటీ కన్సల్టెన్సీ మానవ వనరుల విభాగానికి చెందిన కార్పొరేషన్ ప్రతినిధులు విచ్చేశారని తెలిపారు. మానవ వనరుల ముఖ్య అధికారి యుజిసెక గుచి, సెలక్టింగ్ కమిటీ సభ్యులు టకుయకగొటని, హోనక కటోలతో పాటు చెన్నైకు చెందిన సెంథిల్ సెల్లప్పన్ అనే జపాన్ ప్రతినిధి వర్సిటీలో ప్లేస్‌మెంట్స్, అకడమిక్ టీమ్‌తో సమావేశమయ్యారని వివరించారు. విశ్వవిద్యాలయ ప్రొ.చాన్సలర్ ఏవీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు ఆకర్షణీయమైన జీతంతో పాటు పలు రాయితీలను ఇవ్వడానికి కంపెనీ వారు ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కేఎల్‌యూలో జపాన్ భాషను నేర్చుకుని విద్యార్థులతో జపాన్ భాషలో ముచ్చటించిన జపాన్ ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారని అన్నారు. గత విద్యా సంవత్సరంలో కేఎల్‌యూ నుంచి 10 మంది విద్యార్థులు సంవత్సరానికి 42,37,236 జపాన్ యెన్స్ జీతాన్ని పొందుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఉద్యోగాల కల్పన సీనియర్ డైరెక్టర్ జె.శరవణ బాబు, ఇంజినీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రామకృష్ణ, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



జపాన్ ఐటీ కన్సల్టెన్సీ హెచ్‌ఆర్ ఆఫీసర్ యుజిసెక గుచిని సత్కరిస్తున్న ప్రొ వీసీ డాక్టర్ ప్రసాద్

విద్యుత్ లోఓల్టేజీ సమస్యకు చెక్

రూ.7 కోట్లతో పనులు ప్రారంభం

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని టిడ్కో నివాసాలతో పాటు పలు ప్రాంతాల్లో విద్యుత్ ఓల్టేజీ సమస్యలు తీవ్రంగా ఉండడంతో వినియోగదారులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన వెంటనే విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడడంతో పలుచోట్ల మరమ్మతులు నిర్వహించేందుకు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు ఆ శాఖ రూ.7 కోట్ల నిధులు కేటాయించింది. మంగళగిరి పట్టణంలో బుధవారం పనులు ప్రారంభమయ్యాయి. మంగళగిరి పట్టణ పరిధిలో టిడ్కో, రాజీవ్ గృహకల్ప, మార్కండేయ కాలనీ, మన్నెం వారి బజార్ పరిసర ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్యను అధిగమించేందుకు జర్మన్ ఎ.ఐ.ఎస్. టెక్నాలజీ నిర్మాణంతో జరుగుతున్న సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు నిర్మించారు. త్వరలోనే పనులు పూర్తిచేసి లో ఓల్టేజ్ సమస్యను అధిగమించనున్నట్లు విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అసిస్టెంట్ అక్కల సత్యనారాయణ తెలియజేశారు.



టిడ్కో నివాసాల వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లు అందజేత

తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని వీటీజేఎం, ఐవీటీఆర్ స్కిల్ హబ్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన మొదటి బ్యాచ్ వారికి బుధవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గొడవర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో ఏపీఎస్ఎస్‌డీసీ వారు తమ కళాశాలలో స్కిల్‌హబ్‌ను ఏర్పాటు చేశారని, మొదటి విడతలో డేటాఎంట్రీ ఆపరేటర్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులలో 3 నెలల పాటు 55 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చామని, అందులో సుమారు 40 మందికి ఇప్పటికే ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత కంప్యూటర్ శిక్షణ అవకాశాన్ని నియోజకవర్గంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెంటర్ ఇన్‌చార్జి పి.శ్రావణి మాట్లాడుతూ రెండవ బ్యాచ్ జూలై 1 నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. కె.రామకృష్ణ, ట్రైనర్ కె.సౌజన్య, ప్రేమ, విద్యార్థులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నేడు ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనం ప్రారంభం

తాడికొండ: నేడు తాడికొండ ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనం ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ అత్తోట దీప్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్, ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మీలు హాజరు కానున్నట్లు ఆమె తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.



ప్రారంభానికి సిద్ధమైన నూతన భవనం

దుష్ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు

- తాడేపల్లి పట్టణ, రూరల్‌లో ఒక్క ఇల్లు కూడా తొలగించడం లేదు
- తొలగించమని ఎటువంటి ఆదేశాలు లేవు
- తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ రూరల్ పరిధిలో వివిధ ప్రభుత్వ స్థలాలల్లోను, ఇరిగేషన్ భూములలో ఉన్న నివాసాలు తొలగిస్తారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని తాడేపల్లి తహసీల్దార్ మర్రిరెడ్డి నాగిరెడ్డి అన్నారు. బుధవారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ పరిధిలో ఇప్పటి వరకు లబ్ధిదారులందరికీ ఇళ్ల స్థలాలను ప్రభుత్వం అందజేసిందని, వారితో పాటు అభ్యంతరకర స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి కూడా పట్టాలు అందజేశామని, ఇళ్ల పట్టాలు ఇచ్చారు కాబట్టి ఇళ్లు తొలగిస్తారంటూ కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారని, ప్రస్తుతం అలాంటి ఆలోచన లేదని, ఇప్పటి వరకు ఇళ్ల తొలగింపుపై ఎటువంటి నోటీసులు అందలేదని, మహానాడులో నివసించే వారికి నోటీసులు ఇచ్చారని, నులకపేటలో వారికి ఎన్టీఆర్ కరకట్ట మీద నోటీసులు ఇచ్చారని ప్రచారం చేస్తున్నారని వాటిని ప్రజలు ఎవరూ నమ్మవద్దని తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి అన్నారు. అలాంటి ప్రచారాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.